సాక్షి హనుమకొండ

గురువారం | 9 | నవంబర్ | 2023



రైల్వే స్టేషన్లలో తనిఖీలు

కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్లలో బుధవారం సాయంత్రం సివిల్, రైల్వే పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు.

-IIIలో▸



ఓటు హక్కు వినియోగించుకోవాలి

అర్హులందరూ స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి మధురిమ కోరారు.

-IIIలో▸

గరిష్టం/కనిష్టం
28°/21°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఒకటి రెండు ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు ఈనెల 10

విద్యారణ్యపురి : ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు గడువు ఈనెల 10 వరకు ఉందని హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు అపరాధ రుసుము రూ.2వేలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఇతర ప్రభుత్వ యాజమాన్యాల కళాశాలల్లో అపరాధ రుసుము ఉండదని ఆయన తెలిపారు. అడ్మిషన్లకు ఇదే చివరి గడువు అని పేర్కొన్నారు.

'సౌత్‌జోన్' పోటీలకు కేయూ జట్టు ఎంపిక

కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్ : కాకినాడలోని జేఎన్‌టీయూలో ఈనెల 9 నుంచి 12 వరకు జరుగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ఆచార్య పి.శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు. నానుగొప్పుల అజయ్‌కుమార్ (వాగ్దేవి కళాశాల, హనుమకొండ), చింతు శివాజీ, కె.యువరాజు, మధుపవన్ (కేడీసీ, హనుమకొండ), కె.గాంధీ, భూక్యా ఆజాద్, రమావత్ అనిల్‌కుమార్, అజ్మీరా అఖిల్ (ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల ఖమ్మం), అంబాల రంజిత్‌కుమార్ (వీసీపీఈ బొల్లికుంట), గుగులోత్ లక్‌పతి టి.ఆకాష్ (యూసీపీఈ కేయూ, వరంగల్), ఎం.పవన్‌కల్యాణ్ ఎల్‌బీ కళాశాల, వరంగల్) జట్టులో ఉన్నారు. ఈ జట్టు ఈనెల 7న రాత్రి బయలుదేరి వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. జట్టుకు హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.కిషన్ కోచ్‌గా, ఖమ్మం యూసీపీఈ ఫిజికల్ డైరెక్టర్ పి.కోటయ్య మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని శ్రీనివాస్‌రావు తెలిపారు.

ఉత్సాహంగా బాక్సింగ్ ఎంపిక పోటీలు



హన్మకొండ : హనుమకొండ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సీనియర్స్ పురుషుల బాక్సింగ్ ఎంపిక పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. హనుమకొండ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని డీఎస్‌ఏ బాక్సింగ్‌హాల్‌లో నిర్వహించిన ఎంపికలను సీనియర్ బాక్సర్ డాక్టర్ చాడ సుభాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పోటీలకు జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వహణ కార్యదర్శి వై.సురేందర్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.రవీందర్‌కుమార్, ట్రెజరర్ బి.సర్వేశ్వర్, కార్యదర్శి కమలాకర్, ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ దేవరకొండ ప్రభుదాస్, సీనియర్ బాక్సర్లు సదానందం, గిరి, గిరిధర్, కృష్ణమూర్తి, సుధాకర్, అభినవ్, రాజేందర్, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య బుధవారం తెలిపారు. వివిధ విద్యార్థి సంఘాల విజ్ఞప్తి మేరకు అన్ని విభాగాల అధిపతులతో చర్చించామని, ఈనెల 9 నుంచి నిర్వహించాల్సిన ఆయా సెమిస్టర్ పరీక్షలను ఈనెల 14 నుంచి నిర్వహించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. విద్యార్థులు గమనించాలని కోరారు.

నేటినుంచి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

విద్యారణ్యపురి : నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి 31వ జిల్లాస్థాయి జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కస్తూర్బా గాంధీ, మోడల్, రెసిడెన్షియల్, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టులో ఇద్దరు చొప్పున, ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు జూనియర్స్, ఐదుగురు సీనియర్స్ మొత్తం 10 ప్రాజెక్టులను తీసుకురావొచ్చని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ప్రాజెక్టుకు 18 అంశాలతో కూడిన రిపోర్ట్, లాగ్‌బుక్, 4 చార్టులు, పుట్టిన తేదీ సర్టిఫికెట్లను తీసుకురావాలని ఆయన వివరించారు.

506 కిలోలు

అక్టోబర్‌లో పట్టుబడిన గంజాయి

- నరుకు విలువ రూ.1.24కోట్లు
- ఎన్నికల సమయంలో ఎక్కడికక్కడ తనిఖీలు
- కమిషనరేట్ పరిధిలో బయటపడుతున్న గంజాయి రవాణా
- ఇంతకాలం ఏ మేరకు రవాణా సాగి ఉంటుందన్న దానిపై చర్చ

వరంగల్ క్రైం : రాష్ట్రంలో ఎన్నికల కోలాహలం నెలకొంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసు అధికారులు చేపడుతున్న తనిఖీల్లో విస్తుపోయే ఘటనలు వెలుగు చూస్తున్నాయి. మహారాష్ట్రకు తెలంగాణ మీదుగా జనవరి నుంచి అక్టోబర్ వరకు 1,456 కిలోల గంజాయిని స్మగ్లర్లు రవాణా చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన 10 నెలల్లో పోలీసులు పట్టుకున్న గంజాయి కంటే.. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత 506 కిలోలు పట్టుకున్నది (రూ.1.24 కోట్ల విలువ) పెద్ద మొత్తంలో ఉండటం గమనార్హం. ఎన్నికలను ప్రశాంత వాతవరణంలో నిర్వహించేందుకు కమిషనరేట్ పరిధిలో పోలీస్ శాఖ అధికారులు 10 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలతోపాటు స్థానిక పోలీసులు నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తుండడంతో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడుతోంది.

ఏపీలో తక్కువ ధరకు కొనుగోలు చేసి..

ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ మీదుగా స్మగ్లరు మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్నారు. వందల కిలోల గంజాయిని వ్యాపారులు తక్కువ ధరకు ఏపీలో కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్మగ్లర్లు వివిధ పద్ధతుల్లో గంజాయిని తరలిస్తున్న సంఘటనలు ఇటీవల వెలుగు చూస్తున్నాయి.

పోలీస్ శాఖ ఏం చేస్తున్నట్లు?

తెలంగాణ మీదుగా గంజాయి పెద్ద మొత్తంలో మహారాష్ట్రకు తరులుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గంజాయిని రవాణా చేయడానికి తెలంగాణలో పలు జిల్లాలను దాటాల్సి ఉంది. పోలీసులు తనిఖీలను ముమ్మరం చేస్తే ఏదో ఇక చోట పట్టుబడాలి. కానీ, అలా జరగడం లేదు. పోలీసుల అనుమతితో ఇంతకాలం గంజాయి రవాణా జరిగిందా అనే అనుమానాలు కలుగుతుండడం గమనార్హం.



కాజీపేటలో పట్టుకున్న గంజాయి ప్యాకెట్లను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

ఇటీవల పట్టుబడిన ఘటనలు..

- ఎల్కతుర్తి పోలీసులు గత నెల 16న రూ.75 లక్షల విలువైన 300 కిలోల గంజాయిని పట్టుకున్నారు. స్మగ్లరు ఎవరికి అనుమానం రాకుండా డీసీఎం వాహనం పైకప్పు భాగంలో 5 కిలోల గంజాయి ప్యాకెట్లను అమర్చారు. దానిపై మరో కవర్‌ను కప్పి ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకొచ్చారు. పోలీసులు డీసీఎంను తనిఖీ చేయగా ఎలాంటి గంజాయి లభించలేదు. అనుమానం వచ్చి పైకప్పును పరిశీలించగా 300 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ సంఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.
- హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లాపూర్ వద్ద సెప్టెంబర్ 7న కారులో తరలిస్తున్న రూ.30 లక్షల విలువైన 150 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనలో 8 మంది నిందితులను అరెస్టు చేశారు.
- కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గతనెల 10న రూ.10 లక్షల విలువ గల 40 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ సంఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.
- రైలు ద్వారా బిహార్‌కు తరలిస్తున్న 7 కిలోల గంజాయిని పోలీసులు ఇటీవల స్వాధీనం చేసుకుని ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హసన్‌పర్తిలో రైల్వే పోలీసుల నుంచి తప్పించుకున్న ముఠాను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 20 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీసులు ఇటీవల రూ.10 లక్షల విలువైన గంజాయిని పట్టుకుని స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకొచ్చి రైలులో మహారాష్ట్రకు తరలిస్తున్న క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు.
- వరంగల్ చింతల్‌రోడ్డులోని పుప్పాలగుట్టలో గతనెల 27న ఎక్సైజ్ అధికారులు ఓ వ్యక్తి నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- హనుమకొండ హంటర్‌రోడ్డులో గత నెల 29న పోలీసులు ఓ వ్యక్తి నుంచి రూ.2.50 లక్షల విలువ గల 10 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. గంజాయిని వరంగల్‌లో విక్రయించేందుకు ప్రయత్నించి నిందితుడు పట్టుబడ్డాడు.
- రూ. లక్షల విలువైన 12 కిలోల గంజాయిని ఒడిశా నుంచి వరంగల్‌కు తీసుకువచ్చి ఇటీవల రైల్వే స్టేషన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు.

గత నెలలో 506 కిలోల గంజాయి స్వాధీనం..

పోలీస్ కమిషనరేట్ పరిదిలో జనవరి నుంచి నవంబర్ 7 వరకు 57 గంజాయి కేసులు నమోదయ్యాయి. పోలీసులు 138 మందిని అరెస్టు చేశారు. ఇందులో అక్టోబర్‌లో రూ.1.24 కోట్ల విలువైన 506 కిలోల గంజాయి పట్టబడడం గమనార్హం.

కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన గంజాయి

నెల	కేసులు	అరెస్టు	కిలోలు	రూపాయల్లో
జనవరి	3	11	86	19,44,000
ఫిబ్రవరి	3	7	171	17,24,200
మార్చి	14	40	30	4,43,000
ఏప్రిల్	8	18	41	7,90,120
మే	2	3	121	24,24,000
జూన్	2	2	2	40,000
జూలై	6	9	79	12,05,200
ఆగస్టు	1	2	69	10,00,000
సెప్టెంబర్	5	26	351	59,22,500
అక్టోబర్	13	20	506	1,24,83,500
మొత్తం	57	138	1456	2,79,76,520

జోరుగా నామినేషన్ల దాఖలు



నామినేషన్ వేస్తున్న బీఆర్‌ఎస్ హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీష్‌కుమార్



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్

- హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో స్వీకరించిన రిటర్నింగ్ అధికారులు

హన్మకొండ అర్బన్/వరంగల్ అర్బన్/పరకాల : హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో శాసన సభ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లు జోరందుకున్నాయి. ఈనెల 3న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 10వ తేదీ వరకు కొనసాగనుంది. బుధవారం వరంగల్ పశ్చిమ, తూర్పు, వర్ధన్నపేట, పరకాలలో పలువురు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామిషనేషన్లు దాఖలు చేశారు.

వరంగల్ 'పశ్చిమ'లో ఆరుగురు నామినేషన్

వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫారమ్స్ పార్టీ తరఫున గట్ల యుగేంధర్‌తోపాటు ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.రమేష్‌కు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులు గొల్లైన నరేందర్, పూసల సత్యప్రకాష్, బంక రాజు, గుర్రం శాంతమ్మ, సాయిని రవీందర్ నామినేషన్లు దాఖలు చేశారు.

పరకాలలో మూడు..

పరకాలలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయని ఆర్‌ఓ శ్రీనివాస్ తెలిపారు. పరకాల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన పెండెల కుమారస్వామి (స్వతంత్ర), చెన్నారావుపేట మండల లింగగిరి గ్రామానికి చెంది బానోత్ అనిల్ కుమార్ (స్వతంత్ర), ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామానికి చెందిన యువరాజు సంగేకరి(విద్యార్థి రాజకీయ పార్టీ) తరఫున నామినేషన్లు వేశారు. ఇప్పటివరకు 12 నామినేషన్లు వచ్చాయని ఆర్‌ఓ పేర్కొన్నారు.

హుస్నాబాద్‌లో..

ఎల్కతుర్తి: హుస్నాబాద్ ఆర్‌ఓ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా వొడితెల సతీష్‌కుమార్, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పొన్నం ప్రభాకర్‌గౌడ్ బుధవారం నామినేషన్ వేశారు. వారివెంట మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన..?

ఐనవోలు: కాంగ్రెస్ వర్ధన్నపేట అభ్యర్థి కే.ఆర్ నాగరాజు మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. బుధవారం వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసే క్రమంలో ఉదయం ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం దాటకముందే ఉత్తర ద్వారం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. అరూరి రమేష్‌తోపాటు ఆయన కొడుకుపై రాజకీయ విమర్శలు చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జై కాంగ్రెస్, జై నాగరాజు అంటూ ఆలయ ప్రాంగణంలోనే నినాదాలు చేశాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా ఎన్నికల ప్రత్యేక అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

కారంపొడి గ్యాంగ్ అరెస్ట్

- రూ.19 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన క్రైం ఏసీపీ మల్లయ్య

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న కారంపొడి గ్యాంగ్‌ను సీసీఎస్, హనుమకొండ పోలీసులు అరెస్టు చేసినట్లు క్రైం ఏసీపీ బి.మల్లయ్య తెలిపారు. వారి నుంచి రూ.19 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వరంగల్ సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో నిందితుల అరెస్టు వివరాలను బుధవారం ఏసీపీ వెల్లడించారు. హనుమకొండ కాకతీయ కాలనీకి చెందిన ఎండీ అబ్దుల్‌పాషా, బొక్కలగడ్డకు చెందిన ఎండీ షహీంఅక్రం, గౌస్‌పాషా, ఎస్‌కేఅస్లాం, లష్కర్ బజార్‌కు చెందిన ఎండీ షాహెద్‌తోపాటు ఇద్దరు రిసీవర్లు రఫీక్, రహేనాబేగం జల్సాలకు అలవాటు పడ్డారని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి, మద్యం తాగడానికి సులువుగా డబ్బులు సంపాదించడానికి రాత్రి వేళ చోరీలు చేస్తున్నట్లు చెప్పారు. ఆనవాళ్లు దొరకకుండా సంఘటనా స్థలంలో కారంపొడి చల్లి, దొంగిలించిన సొత్తును అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారని పేర్కొన్నారు. నిందితులు ఒకే కమ్యూనిటీకి చెందినవారు కావడం, వాటర్ సర్వీసింగ్, మెకానిక్ పనులు చేస్తూ ఒకరితో ఒకరు పరిచయం పెంచుకున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్న డబ్బులను తిరిగి సంపాదించేందుకు చోరీలను ఎంచుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో హనుమకొండ, కాజీపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి వేళ ద్విచక్ర వాహనాలపై తిరిగి తాళాలు వేసి ఉన్న ఇళ్లలో బంగారు, వెండి ఆభరణాలు, నగదు దొంగిలించారు ఏసీపీ మల్లయ్య వెల్లడించారు.



నిందితులను అరెస్టు చూపుతున్న క్రైం ఏసీపీ మల్లయ్య

హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని లష్కర్‌బజార్, న్యూ రాయపుర, కాకతీయ కాలనీలోని మూడు ఇళ్లలో, కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫాతిమానగర్, సోమిడి ఏరియాలో రెండు ఇళ్ల తాళాల పగులగొట్టి బంగారు, వెండి నగలు, నగదు దొంగిలించారు. కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్లసింగారంలో రెండు ఇళ్ల తాళాలు పగులగట్టి చోరీకి యత్నించారు. పక్కా సమాచారం మేరకు నిందితులను మంగళవారం హనుమకొండ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ వివరించారు.

అధికారులకు అభినందనలు..

నిందితులను పట్టుకొని చోరీ సొత్తును రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన క్రైం డీసీపీ మురళీధర్, క్రైం ఏసీపీ మల్లయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్, ఐటీ కోర్ ఏఏఓ సల్మాన్ పాషా, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

అభ్యర్థుల వ్యయాన్ని పరిశీలించాలి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : నిబంధనల మేరకు అభ్యర్థుల వ్యయ వివరాలను పక్కాగా నమోదు చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నోడల్ అధికారులు, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు సంబంధించిన సహాయ వ్యయ పరిశీలకులతో ఎన్నికల వ్యయాల నమోదు వివరాలు, ఓటర్ల నమోదు శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థుల వ్యయాన్ని నిశితంగా పరిశీలించి, ఎన్నికల సంఘానికి రోజువారీ నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి ఫిర్యాదులు, సమాచారం తీసుకుంటూ పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన ప్రాంతాలపై ప్రతేక శ్రద్ధ వహించి నమోదు శాతం పెంచాలని చెప్పారు. సమావేశంలో నోడల్ అధికారి సంజీవరెడ్డి, పుష్పలత, భాగ్యలక్ష్మి, రామిరెడ్డి, నర్సింహామూర్తి, అయూబ్ అలీ, శ్రీధర్, శ్రీనివాసరావు, మానస, నారాయణరావు, శ్రీకాంత్, జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

రాజకీయ ఉద్దండులు..

- శాసనసభకు ఐదు, ఆరు పర్యాయాలు వరుసగా ఎన్నిక
- ప్రజాహృదయాలు గెలుచుకున్న పలువురు నేతలు

ఎలక్షన్..సెలక్షన్..

- సార్వత్రిక ఎన్నికల కోసం ఎంపిక చేసిన నెలలు ఇవే..
- నవంబర్‌లో రెండు సార్లు మాత్రమే నిర్వహణ

-IIలో▸

ప్రతిభకు పట్టం.. కళా ఉత్సవం

- నేటినుంచి జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలు
- ప్రభుత్వ ప్రాక్టీసింగ్ స్కూల్‌లో ఏర్పాట్లు
- 170 మంది విద్యార్థులను ఎంపిక చేసిన అధికారులు

విద్యారణ్యపురి : కేంద్ర విద్యాశాఖ, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకత్వంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలను ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నారు. ఇందుకోసం హనుమకొండలోని ప్రాక్టీసింగ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ తదితర పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కళా ఉత్సవ్ పోటీలను ఈనెల 6, 7 తేదీల్లో 13 మండలాల్లో నిర్వహించారు. కాజీపేట మండలానికి సంబంధించిన పోటీలు బుధవారం జరిగాయి. మండలస్థాయిలో ఎంపికైన 170 మంది విద్యార్థులు కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొననున్నారు.

9, 10, 11, 12 తరగతి విద్యార్థులకు అవకాశం..


హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ప్రభుత్వ సహాయక పాఠశాలల్లో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు గైడ్ టీచర్ సాయంతో శిక్షణ పొందితే పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వారికి రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను జాతీయస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపిక చేసి పంపిస్తారు.

10 అంశాల్లో పోటీలు

సంప్రదాయ గాత్ర సంగీతం, సంప్రదాయ జానపద గాత్ర సంగీతం, వాయిద్యాలకు సంబంధించిన సంగీతం, సంప్రదాయ నృత్యం, జానపద నృత్యం, విజువల్ ఆర్ట్స్ టూ డైమెన్షనల్ విజువల్ ఆర్ట్స్ త్రీ డైమెన్షనల్, స్వదేశీ బొమ్మలు, ఆటలకు సంబంధించిన కృతుల తయారీ, డ్రామా సోలో యాక్టింగ్ (ఏకపాత్రాభినయం) వంటి 10 అంశాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ప్రతి అంశం నుంచి బాలురు ఒకరు, బాలికలు ఒకరు చొప్పున మండలస్థాయి పోటీల్లో ప్రతిభ చూపినవారిని జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. మండలస్థాయి కళా ఉత్సవ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈఓలు ఎంపిక చేశారు. వారి వివరాలను బుధవారం డీఈఓకు పంపారు. జిలాస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు ఈనెల 15, 16 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు పంపిస్తారు. అందులో ఎంపికైనవారు జాతీయస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొంటారు.

జాతీయస్థాయి ప్రథమ బహుమతి రూ.25 వేలు..

జాతీయస్థాయిలో మొదటి బహుమతి సాధించిన వారికి రూ.25 వేల నగదు అందజేస్తారు. ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ. 20 వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.15 వేల నగదు బహుమతి అందజేస్తారు. గత విద్యాసంవత్సరం జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన ఒక విద్యార్థిని ప్రధాని నరేంద్రమోదీ అభినందించారు. జాతీయ రిపబ్లిక్‌డే వేడుకలు, పరీక్షపే చర్చా కార్యక్రమానికి ఆహ్వానం అందుకున్నారు.



కళా ఉత్సవ్‌ను వినియోగించుకోవాలి



జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులు తమలోని కళలను ప్రదర్శించేందుకు కళా ఉత్సవ్ ఒక వేదిక అవుతుంది. ఈనెల 9న ఓకల్ మ్యూజిక్ క్లాసికల్, ఓకల్ మ్యూజిక్ (ఫోక్), ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, పెర్క్యూసివ్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ మెలోడీ, వర్చువల్ ఆర్ట్ డీ, వర్చువల్ ఆర్ట్ 3డీ, డ్రామా (సోలో) పోటీలు ఉంటాయి. ఈనెల 10న డ్యాన్స్ (క్లాసికల్), డ్యాన్స్ (ఫోక్), ఇండిజినస్ టాయ్స్ అండ్ గేమ్స్ పోటీలు ఉంటాయి. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఉదయం 9–30 గంటలకు హాజరుకావాలి.

– ఎండీ అబ్దుల్‌హై, హనుమకొండ డీఈఓ

ఏర్పాట్లు చేశాం..



విద్యార్థులు తమ కళాప్రతిభను నిరూపించుకునేందుకు కళాఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిస్తే రాష్ట్రస్థాయి, ఆ తర్వాత జాతీయ స్థాయి వరకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల నిర్వహణకు హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పీఎస్, హైస్కూల్‌లో ఏర్పాట్లు చేశారు. ఏమైనా సందేహాలు ఉంటే వివరాలకు జిల్లా సోషల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి (9849834110)ని సంప్రదించాలి.

– ఎ.శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్



ఫ్రీ లెఫ్ట్.. బోర్డుకే పరిమితం!

వరంగల్ నగరంలోని పోలీస్ కమిషనరేట్ చౌరస్తా వద్ద పబ్లిక్ గార్డెన్‌కు వెళ్లే దారిలో ఫ్రీ లెఫ్ట్ ఉండాలి. కానీ అక్కడ ఆటోవాలాలు, ఇతర వాహనాలు ఇష్టానుసారంగా ఆగుతుండడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పోలీసులు 'ఫ్రీ లెఫ్ట్ ఉల్లంఘనకు రూ. వెయ్యి జరిమానా' అంటూ బోర్డు పెట్టారు. కానీ అవేమీ పట్టకుండా ఇష్టానుసారంగా ఆపుతున్నారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హన్మకొండ

సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: సైబర్ నేరాల ఫిర్యాదులపై పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న సైబర్ వారియర్స్ సిబ్బందితో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులపై సైబర్ వారియర్స్ తీసుకుంటున్న చర్యలతోపాటు, పెండింగ్ కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో తీసుకుంటున్న చర్యలపై అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్ది అదే స్థాయిలో సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాల్లో ఆర్థికనేరాలకు పాల్పడుతూ ప్రజల సొమ్మును దోచేస్తున్నారన్నారు. వీటిని నియంత్రించాలంటే ముందుగా సైబర్ నేరాలు జరిగే తీరుతెన్నులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. బాధితులు టోల్ ఫ్రీ నంబర్ 1930కి సమాచారం అందించేలా చూడాలన్నారు. సైబర్ క్రైమ్స్ ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్ల వివరాలు (తేదీ : 08-11-2023 వరకు)

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఇతరులు
వరంగల్ తూర్పు	01	-	01	09
వరంగల్ పశ్చిమ	-	01	01	08
జనగామ	01	01	-	08
పాలకుర్తి	03	-	01	06
స్టేషన్‌ఘన్‌పూర్	-	01	-	07
జేఎస్.భూపాలపల్లి	-	01	01	07
ములుగు	-	01	-	03
నర్సంపేట	01	-	01	09
వర్ధన్నపేట	-	01	01	05
పరకాల	-	-	01	09
మహబూబాబాద్	01	01	01	03
డోర్నకల్	01	-	01	06

కేసీఆర్‌పై పోటీకి మడికొండ నివాసి నామినేషన్


గజ్వేల్‌లో ఎన్నికల అధికారికి నామినేషన్ సెట్ అందజేస్తున్న ఫారూఖ్ హమ్మద్

మడికొండ: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బుధవారం కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన ఫారూఖ్ హమ్మద్.. కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్‌లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. గత 2018 ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేసిన ఫారూఖ్ హమ్మద్.. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి పై పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు చింతకుంట్ల భూపాల్‌రెడ్డి, వస్కుల వెంకటస్వామి పాల్గొన్నారు.

అప్పట్లో అభ్యర్థికో ఇనుప పెట్టె..

ఈ ముచ్చటెరికేనా ?

కాజీపేట: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నేడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వినియోగిస్తున్నారు. ఈ విధానం ద్వారా ఎన్నికలు ఎలాంటి హడావుడి లేకుండా సజావుగా జరుగుతున్నాయి. అయితే 1952, 1957 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులకు ప్రత్యేకంగా ఇనుప పెట్టెలను బ్యాలెట్ బాక్స్‌లుగా ఏర్పాటు చేశారు. కాగా, ఓటర్లు విధిగా అభ్యర్థికి కేటాయించిన పెట్టెల్లోనే ఓట్లు వేయాల్సి ఉండగా.. గెలుపొందేది ఎవరనే విషయం ముందుగానే తెలిసేది.

సంస్కరణలతో మార్పు..

సంస్కరణల్లో భాగంగా 1962లో నిర్వహించిన ఎన్నికల్లో పోలింగ్ బూత్‌కు ఒక పెట్టె ఏర్పాటు చేశారు. బూత్‌లోని ఓటర్ల సంఖ్య ఆధారంగా ఇనుప పెట్టెలను నార సంచుల్లో తీసుకుని వాహనాల్లో కేటాయించిన గ్రామాలకు వెళ్లేవారు. అయితే 1982లో ఎలక్ట్రానిక్ యంత్రాల వినియోగం ఆరంభం కావడంతో ఓటింగ్‌లో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సిబ్బందికి శారీరక శ్రమ తగ్గింది. అలాగే, ఓటింగ్‌లో అక్రమాలకు తెరపడిందని చెప్పొచ్చు.


అప్పటి ఓటింగ్ పెట్టె

జంగ్ తెలంగాణ

హెలికాప్టర్ తనిఖీ



భూపాలపల్లి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పోలీసులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం బీజేపీ చేరికల కమిటీ చైర్మన్, సీనియర్ నేత ఈటల రాజేందర్ ఎన్నికల ప్రచారం నిమిత్తం హెలికాప్టర్‌లో భూపాలపల్లికి వచ్చారు. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు స్థానిక సీఐ రాంనర్సింహారెడ్డి, ఎంఈఓ కె.రఘుపతి, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు హెలికాప్టర్‌ను తనిఖీ చేశారు.

- భూపాలపల్లి

ప్రజాస్వామ్యంలో బానిసలు ఉండరు.. యజమానులూ ఉండరు.

- అబ్రహాంలింకన్



రాజకీయ ఉద్దండులు..

అసెంబ్లీ ఎన్నికల్లో అప్రతిహత విజయాలు..

- శాసనసభకు ఐదు, ఆరు పర్యాయాలు వరుసగా ఎన్నిక
- ప్రజాహృదయాలు గెలుచుకున్న పలువురు నేతలు


హన్మకొండ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో అప్రతిహత విజయాలు సాధించిన రాజకీయ ఉద్దండులున్నారు. ఒకటి కంటే ఎక్కువ సార్లు శాసనసభకు ఎన్నికై రికార్డు సాధించారు. ప్రజా హృదయాలు గెలుచుకుని వరుసగా ఐదు, ఆరు పర్యాయాలు అసెంబ్లీలో అడుగు పెట్టి వారి సత్తాను చాటారు. రాజకీయాల్లో సుదీర్ఘకాలం కొనసాగారు. నాలుగు పర్యాయాలు ఎన్నికైన వారు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్నారు. డోర్నకల్ నియోజకవర్గం నుంచి నూకల రాంచంద్రారెడ్డి, రామసహాయం సురేందర్ రెడ్డి నాలుగు సార్లు వరుస విజయాలు సాధించారు. జనగామ నుంచి పొన్నాల లక్ష్మయ్య నాలుగు పర్యాయాలు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. వరంగల్ పశ్చిమ నుంచి దాస్యం వినయ్ భాస్కర్, శాయంపేట, పరకాల, వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ నాలుగు సార్లు ఎన్నికవడంతో పాటు ప్రస్తుత ఎన్నికల్లోనూ మరోసారి పోటీ చేస్తున్నారు.



ఎన్.యతిరాజా రావు



రద్దయిన అసెంబ్లీ నియోజకవర్గం చెన్నూరు నుంచి నెమరుగొమ్ముల యతిరాజారావు 7 సార్లు విజయం సాధించారు. సోషలిస్టు, కాంగ్రెస్, టీడీపీ నుంచి అసెంబ్లీలో ప్రాతినిథ్యం వహించారు. ఒక్క సారి స్వతంత్ర అభ్యర్థిగానూ విజయం సాధించారు. 1962లో సోషలిస్టు పార్టీ నుంచి మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. 1975లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1978, 1983లో కాంగ్రెస్ నుంచి 1985, 1989, 1994లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు.



మద్దికాయల ఓంకార్



నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదు పర్యాయాలు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. సీపీఎం నుంచి మూడు సార్లు, స్వతంత్ర (ఎంసీపీఐ) అభ్యర్థిగా 2 సార్లు అసెంబ్లీలో అడుగిడారు. 1972లో మొదటి సారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1972, 1978, 1983లో సీపీఎం నుంచి, 1985, 1989లో స్వతంత్ర (ఎంసీపీఐ) నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1994లో టీడీపీ అభ్యర్థి రేవూరి ప్రకాశ్ రెడ్డిపై 87 అత్యల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు.

జెన్నారెడ్డి జనార్దన్ రెడ్డి



మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జెన్నారెడ్డి జనార్దన్ రెడ్డి వరుసగా ఐదు పర్యాయాలు ఎన్నికయ్యారు. ప్రతిసారి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించడం విశేషం. రాజకీయాల్లో తనకంటు ప్రత్యేక ముద్ర వేసుకున్న జనార్దన్ రెడ్డి 1972లో మొదటి సారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1978, 1983, 1985, 1989లో వరుస విజయాలు సాధించారు.

ఎర్రబెల్లి దయాకర్ రావు



ప్రస్తుత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వర్ధన్నపేట, ప్రస్తుత పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఆరు సార్లు వరుసగా విజయాలు సాధిస్తూ వస్తున్నారు. 1994లో తొలిసారి వర్ధన్నపేట నియోజక వర్గం నుంచి అసెంబ్లీలో అడుగిడారు. 1994, 1999, 2004లో టీడీపీ అభ్యర్థిగా వర్ధన్నపేట నుంచి విజయం సాధించగా 2009, 2014లో టీడీపీ నుంచి, 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ ఎన్నికల బరిలో మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

డీఎస్ రెడ్యానాయక్



డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి డీఎస్ రెడ్యానాయక్ 1989లో మొదటి సారి శాసనసభకు ఎన్నికయ్యారు. ఆరు సార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1989, 1994, 1999, 2004, 2014 కాంగ్రెస్ నుంచి 2018లో బీఆర్ఎస్ నుంచి విజయం సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో గిరిజన శాఖ మంత్రిగా పని చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ మరోసారి పోటీ చేస్తున్నారు.

మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కాంగ్రెస్ మాటలు నమ్మిమోసపోవద్దు

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దు.. మళ్లీ సీఎంగా కేసీఆర్ వస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. బుధవారం రాయపర్తి మండలంలోని రాగన్నగూడెం, గణేష్‌కుంట తండా, జేతురాం తండా, జింకురాం తండా, కేశవాపురం, ఎర్రకుంట తండా, ఆరెగూడెం, కొలన్‌పల్లి, జయరాం తండా, పోతిరెడ్డిపల్లి, వాంకుడోత్ తండా, కిష్టాపురం, పన్యానాయక్ తండా గ్రామాల్లో మంత్రి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో జయమ్మ అనే మహిళ తన చద్దన్నం మంత్రికి ఆప్యాయంగా తినిపించింది. రేలారే రేలా ఫేం గంగా, ఫోక్ సింగర్ కనకవ్వ పాటలు పాడుతూ ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గుడిపూడి గోపాల్‌రావు, మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, పూస మధు, వనజారాణి, లక్ష్మీనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించండి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

న్యూశాయంపేట : మత తత్వ బీజేపీ, అవినీతి బీఆర్ఎస్ పార్టీలను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం మండ సదాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ వల్ల ప్రజాసామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రజాసామ్య పరిరక్షణకు లౌకిక శక్తులను రాష్ట్రంలో గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం చెందిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు భిక్షపతి, జ్యోతి, శ్రీనివాస్, వలిఉల్లాఖాద్రీ, ఎల్లేశ్, రాములు, లక్ష్మణ్, రాజమౌళి, వీరస్వామి, లింగారెడ్డి, వెంకటరమణ, సంతోష్, రవి, మల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

సస్పెండైనా.. యథావిధిగా విధులు !

- కలెక్టర్‌కు నాగారం గ్రామస్తుల ఫిర్యాదు

హసన్‌పర్తి : హసన్‌పర్తి మండలం నాగారం గ్రామ ఓం మహేశ్వరి గ్రామైక్య సంఘంలో వీఓఏగా విధులు నిర్వర్తిస్తున్న సాంబయ్యపై ఉన్నతాధికారులు వేటు వేసినా యథావిధిగా విధులు నిర్వర్తిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఈమేరకు కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు బుధవారం వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆఫీస్ బేరర్స్ (ఓబీ) సంతకాలు ఫోర్జరీ చేసి సుమారు రూ.9 లక్షలు మాయం చేశారని డీఆర్‌డీఏ అధికారులు విచారణ జరిపి సాంబయ్యను 14 నెలల క్రితం సస్పెండ్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినా సాంబయ్య మాత్రం యథావిధిగా విధులు నిర్వర్తిస్తున్నాడని చెప్పారు. స్థానిక ఏపీఎం సహకారంతోనే ఈ వ్యవహారం కొనసాగుతోందని ఆరోపించారు. కాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు.

ఆస్తులు.. అప్పులు.. ఆదాయాలు..

వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్ఎస్, బీజేపీ(శుక్రవారం), మహబూబాబాద్ బీఆర్ఎస్, కాంగ్రెస్, భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా తమ ఆస్తులు, అప్పులు, ఆదాయాలు, ఇతర వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

● బీఆర్ఎస్ వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్ ఆస్తులు..



వరంగల్ అర్బన్: బీఆర్ఎస్ వరంగల్ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నన్నపునేని నరేందర్ వద్ద రూ.1.40 లక్షలు, తన భార్య వద్ద రూ.1.62 లక్షల నగదు ఉంది. నరేందర్ పేరిట మూడు వాహనాలు, 30 గ్రాముల బంగారం, తన భార్య పేరిట ఒక కారు, స్కూటీ, 280 గ్రాముల బంగారం ఉంది. స్థిర ఆస్తులు ఎమ్మెల్యే నరేందర్‌కు పెరుకవాడ, ఎస్ఆర్ఆర్‌తోట, ఖమ్మం రోడ్డు రోటరీ క్లబ్‌కు సమీపంలో మూడు నివాసాలు ఉన్నాయి. మొత్తం తన ఆస్తి రూ.1.74 కోట్లు, తన భార్య పేరిట 1.05 కోట్లు, తన కుమారుడి పేరిట రూ.75,439 ఉన్నాయి. పోలీసు కేసులు లేవు.

బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు..



వరంగల్ తూర్పు బీజేపీ అభ్యర్థి ప్రదీప్ రావు తన పేరిట రూ.13.88కోట్లు, తన భార్య రేణుక పేరిట రూ.8.99కోట్ల స్థిర, చర ఆస్తులు ఉన్నాయి. ప్రదీప్ రావు పేరిట చర ఆస్తులు రూ.90వేల నగదు, 100 గ్రాముల బంగారం, వివిధ బ్యాంకుల్లో డిపాజిట్లు, పెట్టుబడులు మొత్తం రూ.2.23కోట్లు, ఆయన సతీమణి రేణుక చేతిలో రూ.75వేల నగదు, 500 గ్రాముల బంగారం, వివిధ బ్యాంకుల్లో డిపాజిట్లు, పెట్టుబడులు మొత్తం రూ.1.82 కోట్లు ఉన్నాయి. స్థిరాస్తులు ప్రదీప్ రావు పేరుతో అంజీపూర్, పంథిని, గొట్లకొండ, తిమ్మాపూర్, ఏనుమాముల, హైదరాబాద్ పెద్ద అంబర్‌పేట, పోచారం, మణికొండలో వ్యవసాయం, ఖాళీ స్థలాలు, భవనాలు తదితర ఆస్తుల మొత్తం రూ.13.88 కోట్లు ఉంది. తన భార్య రేణుక పేరుతో పంథిని, వసంతాపూర్, రాయపర్తి, ఏనుమాముల, హనుమకొండ లష్కర్ సింగారం, ఖిలా వరంగల్‌రోడ్డు, హంటర్ రోడ్డు సొసైటీ కాలనీ, సంతోషిమాత కాలనీ తదితర ప్రాంతాల్లో వ్యవసాయం, ఖాళీ స్థలాలు, నివాసాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర ఆస్తుల మొత్తం విలువ రూ. 8.99 కోట్లు ఉంది. ఇకపోతే అప్పు కెనరా బ్యాంకులో ఇంటి రుణం రూ.1.79 కోట్లు ఉంది. పోలీసు కేసులేమి లేవు.

బీఆర్ఎస్ మానుకోట అభ్యర్థి శంకర్ నాయక్..



మహబూబాబాద్ : బీఆర్ఎస్ మానుకోట ఎమ్మెల్యే అభ్యర్థిగా బానోత్ శంకర్ నాయక్ ఆస్తులు విలువ రూ 23.14 కోట్లు. అప్పు తన, తన భార్య పేరుతో కలిపి రూ 5. 25 కోట్లు.

వారసత్వ ఆస్తుల విలువ :
- రూ. 51.69 లక్షలు

శంకర్‌నాయక్ బ్యాంక్ ఖాతా వివరాలు :
- ఆరు బ్యాంకుల్లోని ఖాతాల్లో రూ. 46.19 లక్షలు ఉన్నాయి.
- తన భార్య మహలక్ష్మి పేరున నాలుగు ఖాతాలకుగాను రూ 9.53 లక్షలు ఉన్నాయి.

షేర్లు :
- శంకర్‌నాయక్ పేరున రూ 19.30 లక్షలు, తన భార్య పేరున రూ.12,500 ఉన్నాయి.

వాహనాలు :
- శంకర్‌నాయక్ పేరున 5, తన భార్యపేరున 2 వాహనాలు ఉన్నాయి. అలాగే, తన భార్య పేర రూ. 5 లక్షల ఎల్ఐసీ పాలసీ ఉంది.

భూములు :
- శంకర్‌నాయక్ పేరున 29.12 ఎకరాలు, తన భార్య పేరున 20.31 ఎకరాలు ఉన్నాయి. వ్యవసాయేతర భూములు శంకర్‌నాయక్ పేరున 5 పాట్లు , భార్యపేరున 3 ప్లాట్లు ఉన్నాయి. కమర్షియల్ ఇండ్లు శంకర్‌నాయక్ పేరున 5, తన భార్య పేరున ఒక ఇల్లు ఉంది. రెసిడెన్షియల్ ఇల్లులు శంకర్‌నాయక్ పేరున 6, తన భార్య పేరున 3 ఉన్నాయి.

బంగారం :
- శంకర్‌నాయక్ పేరున 50 గ్రాములు, తన భార్య పేరున 250 గ్రాములు ఉన్నాయి.

కేసులు :
- ఇప్పటి వరకు రెండు కేసులు నమోదయ్యాయి.

కాంగ్రెస్ మానుకోట అభ్యర్థి మురళీనాయక్..

మహబూబాబాద్: కాంగ్రెస్ మానుకోట ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య మురళీనాయక్ ఆస్తులు సుమారు రూ. 7 కోట్లు, అప్పు రూ 35. 87 లక్షలు ఉంది. వారసత్వంగా వచ్చిన భూమి 10 ఎకరాలు ఉంది.



షేర్లు :
- మురళీనాయక్ పేరున 17 ఉన్నాయి. వాటి విలువ రూ 2.01 లక్షలు.
- మురళీనాయక్ పేరున రూ. 90,300,000 ఎల్ఐసీ పాలసీ ఉంది.

వాహనాలు :
- మురళీనాయక్ పేరున 2, భార్య పేరున రెండు బైక్‌లు

బంగారం :
- మురళీనాయక్ పేరున 25 గ్రాములు, భార్య ఉమ పేరున 150 గ్రాములు ఉంది.

వ్యవసాయేతరభూములు :
- మురళీనాయక్ పేరున రెండు ప్లాట్లు, భార్యపేరున మూడు, కమర్షియల్ ఇళ్లు మురళీనాయక్ పేరున ఒకటి ఉంది. రెసిడెన్షియల్ ఇల్లులు మురళీనాయక్ పేరున 2, భార్యపేరున ఒకటి ఉంది. కోర్టు కేసులు మూడు ఉన్నాయి.

కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు..



భూపాలపల్లి అర్బన్: కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు వద్ద నగదు రూ.1.50 లక్షలు, వివిధ బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.55.05 లక్షలు, ఇన్సూరెన్స్ రూ.లక్ష, బంగారం 20 గ్రాములు ఉంది. గణపురం మండలం బుద్దారంలో 5 ఎకరాలు, వరంగల్‌లో 1.05 ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 0.154 ఎకరాలు మొత్తం 6.204 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. వీటి విలువ రూ.3.40 కోట్లు. గణపురం, బుద్దారం, హనుమకొండ, భూపాలపల్లిలో ఇళ్లు ఉన్నాయి. వాటి విలువ రూ.2.12 కోట్లు. మూడు వాహనాలు న్నాయి. వీటి విలువ రూ.51.05 లక్షలు ఉంది. వివిధ బ్యాంకుల ద్వారా రూ.1.76 కోట్ల రుణాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 5 పోలీసు కేసులు నమోదయ్యాయి.

- సత్యనారాయణ సతీమణి పద్మ వద్ద రూ.1.80లక్షల నగదు ఉండగా బ్యాంకు ఖాతాల్లో రూ.27,248 ఉన్నాయి. ఇన్సూరెన్స్‌లు 2.90 లక్షలు, బంగారు 150 గ్రాములు, వెండి 500 గ్రాములు ఉంది. వీటి విలువ రూ.8.50లక్షలు. బుద్దారంలో 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీని విలువ రూ.75లక్షలు, రూ.3.10 కోట్ల విలువైన వ్యవసాయేతర భూములున్నాయి. హనుమకొండలో రూ.1.50 కోట్ల విలువైన ఇల్లు ఉంది. బ్యాంకు రుణం రూ.1.90 లక్షలు ఉంది.

- సార్వత్రిక ఎన్నికల కోసం ఈసీ ఎంపిక చేసిన నెలలు ఇవే..
- నవంబర్‌లో రెండు సార్లు మాత్రమే నిర్వహణ
- అత్యధికంగా ఫిబ్రవరి, ఏప్రిల్‌ల్లో
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1989లో ఒకసారి, 2023లో తెలంగాణలో మరోసారి (ప్రస్తుతం)..

ఎలక్షన్..సెలక్షన్..

కాజీపేట: దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత నవంబర్ నెలలో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నాయి. 1952లో దేశంలో మొదటిసారి రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో రాష్ట్రంలో (ఉమ్మడి ఏపీ, తెలంగాణ) నవంబర్ నెలలో ఎన్నికలు ఇది జరగడం రెండోసారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1989 నవంబర్‌లో ఎన్నికలు నిర్వహించారు. అంటే 34 ఏళ్ల తర్వాత 2023 నవంబర్‌లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 16 దఫాలుగా ఎన్నికలు జరిగాయి.

1952లో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి	1989 నవంబర్ 22
1957 ఫిబ్రవరి 25	1994 డిసెంబర్ 01
1962 ఫిబ్రవరి 08	1999 సెప్టెంబర్ 18
1972 మార్చి 15	2004 ఏప్రిల్ 20
1978 ఫిబ్రవరి 25	2009 ఏప్రిల్ 16
1983 మే 01	2014 ఏప్రిల్ 30
1985 మే 03	2018 డిసెంబర్ 07
	2023 నవంబర్ 30

ఇందులో రెండు సార్లు మాత్రమే నవంబర్‌లో జరిగాయి. ఇప్పటి వరకు ఎన్నికలు ఏ సంవత్సరంలో ఏ నెలలో జరిగాయో పరిశీలిద్దాం.



పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు
పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే
ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు.
పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు
వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు.
ఇందులో భాగంగా ఇటీవల
మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది.
కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో
దేదీప్యమానంగా వెలిగిపోవాలి.
అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు
అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స
చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి,
కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి
ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో
అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు..
వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి?
భేష్ అనదగిన విధానాలేమిటి?
అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ-బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మొటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మొటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు


డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?



దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలాని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

తాతయ్య మరణంతో...

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్ల నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి


● ఫౌజియా

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు. ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో.

పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో'పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు. ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.


'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్దిమందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.

డానిష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.